




సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

సోమవారం 9-6-2025

సంపుటి: 21 సంచిక: 65
పేజీలు: 8 వెల: రూ.1


## ఆరోగ్యానికి మించిన సంపద లేదు



- యోగాతో మన జీవనశైలిలో మార్పులు గమనించవచ్చు
- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్
- జిల్లాలో మాస్ యోగా ర్యాలీలు


సత్యంన్యూస్, శ్రీకాకుళం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందడంతో పాటు జీవనశైలిలో మార్పులు గమనించవచ్చని, ఆరోగ్యానికి మించిన సంపద ఇంకేమి ఉండదని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన యోగాంధ్రకు శ్రీకాకుళం జిల్లాలో విశేష స్పందన లభిస్తుందన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషుల) నుంచి సోమవారం చేపట్టిన యోగాంధ్ర ర్యాలీలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఇతర అధికారులతో కలసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా, డివిజన్, మండల, గ్రామస్థాయిలలో యోగా ర్యాలీలు నిర్వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఇచ్చిన పిలువుమేరకు నగరంలో ప్రతీపౌరుడూ పాల్గొన్నారని తెలిపారు. ఈ నెల 21 నాటికి 2 కోట్ల మంది భాగస్వామ్యం లక్ష్యంగా పెట్టగా, ఇప్పటికే 1.13 కోట్ల మందికి పైగా నమోదు చేసుకున్నారన్నారు. ఈ నెల 21 అంతర్జాతీయ యోగాదినోత్సవాన్ని పురస్కరించుకొని నెలరోజుల పాటు నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా మాస్ యోగా ర్యాలీలు నిర్వహించారు. 21న విశాఖ వేదికగా జరిగే ప్రధాన కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొంటారని, యోగాను దినచర్యలో భాగం చేసుకొని, ఆరోగ్యకరమైన జీవితాన్ని సొంతం చేసుకోవాలని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడులు యోగాంధ్రను విజయవంతం చెయ్యటంలో భాగమయ్యారని, ప్రజల్లో చైతన్యం తేవటానికి, ప్రజా ఆరోగ్యమే ముఖ్య ఉద్దేశ్యంగా చేపడుతున్న యోగాంధ్ర తప్పకుండా ఆరోగ్యకరమైన జీవితాన్ని అందిస్తుందన్నారు. యోగాంధ్ర ర్యాలీ ఏడు రోడ్ల కూడలి వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఆర్డీఓ కె.సాయి ప్రత్యూష, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, డ్వామా పిడి సుధాకర్, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ జగదీష్, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ బి.శాంతిశ్రీ, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.వి.వి.డి. ప్రసాదరావు, హెల్తాఫీసర్ సుధీర్, నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్, రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షులు జగన్మోహనరావు, స్వచ్ఛంద సంస్థల యోగా కేంద్రాల ప్రతినిధులు, యోగా శిక్షకులు, యోగా సాధకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అక్కచెల్లెళ్ల సంబరం..

# చూడాలి వైభవం!







- పొలుమూరు కుటుంబీకుల నుంచి నూకాలమ్మ
- మావూరి ఇంటి నుంచి పెద్దమ్మ
- అంజలి రథం మీద కొండక కుటుంబం
- 1963 తర్వాత ఉత్సవాలకు బ్రేక్
- పాతశ్రీకాకుళంలో మరికొద్ది గంటల్లో సిరిమానోత్సవం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పదేళ్లకోసారొచ్చే పండగ.. పాతశ్రీకాకుళానికి పెద్దపండగ.. పెద్దమ్మతల్లి పండగ.. లాజిక్కులు వెతక్కపోతే నేటి తరానికి తెలియని కొత్త కథ. మహిమలు, అమ్మవార్లు, జంతుబలులు వంటి అంశాలను కాసేపు పక్కన పెట్టి చూస్తే ఆసక్తి కలిగించే కథ. మన పక్క జిల్లా విజయనగరంలో విజయదశమి తర్వాత వచ్చే మొదటి మంగళవారం - మిగతా చివరి పేజీలో

# అవును.. మొత్తం వాళ్లే చేశారు!

- చంద్రగుప్త మౌర్యుడు.. బింబిసారుడు.. అశోకుడు. అంతే.. మూడో తరానికి అవుట్. మౌర్యులు.. గుప్తులు.. హుణులు.. కుషాణులు.. ఖిల్జీ.. తుగ్లక్.. మొఘల్.. మొత్తం భారత దేశ చరిత్ర చెప్పే సారం ఇదే. మూడో తరానికి మించి.. ఏ రాజ వంశంలో హీరోలు పుట్టలేదు. నాలుగో తరం నుంచి జీరోలే.. సన్నాసులే. ఆధునిక కాలంలో కూడా అంతే.
- జూబిలీ హిల్స్.. బంజారా హిల్స్.. మాదాపూర్.. రాజవంశాల చరిత్ర చూడండి.. తాత గారు గొప్పోడు. మెట్టు మెట్టు ఎక్కి బిజినెస్ సామ్రాజ్యాన్ని నిర్మించాడు. రెండో తరం ఓకే. మూడు కష్టం. నాలుగు ఇంపాజిబుల్. నేను చెబుతున్నది పిల్లల్ని పెంచి పెద్ద చేసే పద్ధతి గురించి మాస్టారు!
- లోకనాయకుడు కృష్ణుడు అంతటి వాడే కొడుకుల పెంపకంపై దృష్టి పెట్టలేనంత బిజీ అయిపోయి తన తర్వాత తన వంశ నాశనానికి పరోక్షంగా కారణమయ్యాడు.
- లైఫ్ కూడా క్రికెట్ మ్యాచ్ లాంటిదే. కాకపోతే ఇండియన్ పోరంబోకు లీగ్ కాదు. ఐపీల్ ఒక టీం కాదు. అది ఒక ఆట కాదు. అది వేరే టాపిక్. మధ్య తరగతి.. ఎగువ తరగతి తల్లిదండ్రులు.. నేడు తమ కోసమే కాకుండా తమ పిల్లలు 'జీవితాంతం కాలిపై కాలు వేసుకొని హాయిగా తినేంత' సంపాదిస్తున్నారు.
- డబ్బున్నా.. పిల్లల్ని పెంచడం ఒక కళ. వారి ఆటను వారిని ఆడనివ్వండి. అపార సంపద ఉన్నా మార్వాడీ.. పార్సీ యూత్ దుకాణానికి ఫ్యాక్టరీకు ఉదయం పదింటికే ఎందుకు పోతున్నారో.. వారి పెంపకం ఏంటో ఒక్కసారి లుక్ వెయ్యండి.
- మన పిల్లలు మన జీన్స్ పంచుకొని పుడతారు. అంతకు మించి మనల్ని చూసి నేర్చుకొంటారు. ఆవు / ఎద్దు చేలో పడి మేస్తుంటే.. దూడలు గట్టున మేస్తాయా? పిల్లల్ని పెంచడం ఒక కళ!





- నేడు అధిక శాతం యువత చెడుదారిలో వెలుతోందంటే ఒక ముఖ్యమై కారణం తల్లిదండ్రులు. ఆకలేస్తేనే.. తిండి రుచిగా ఉంటుంది. దాహమేసినప్పుడు మంచి నీరు స్వీట్‌గా అనిపిస్తుంది. చీకటి.. వెలుతురు.. కష్టం సుఖం.. కావడి కుండలు ! రాత్రన్నదే లేక 24 గంటలూ వెలుతురుంటే? ఆకలెయ్యక ముందే... అన్నం తినాల్సివస్తే? పనీ పాటా లేక.. రోజంతా పడుకోవాల్సి వస్తే? జీవితం బోర్ కొట్టేస్తుంది. బతుకు నరకప్రాయం అయిపోతుంది. అవునా? కాదా?
- 'మేము పడిన కష్టాలు మా పిల్లలు పడకూడదని' నేడు అధిక శాతం తల్లిదండ్రులు తపన పడుతున్నారు. వారి కోసం శక్తికి మించి సంపాదిస్తున్నారు. మీ ప్రేమ చల్లగుండా.. మీరు మీ పిల్లలకు చేస్తున్న నష్టమేమిటో ఇప్పటికైనా గ్రహించండి.

మీ కుటుంబం ఒక క్రికెట్ టీం అనుకోండి. ఇంట్లో తాత, అవ్వ ఓపెనింగ్ బాట్స్‌మెన్ / బ్యాట్స్ విమెన్. అమ్మ నాన్న వన్ డౌన్.. టు డౌన్ బాట్స్‌మెన్/ బ్యాట్స్ విమెన్. 'అబ్బే.. మా పిల్లలు ఒట్టి అమాయకులు.. పసిపిల్లలు.. వాళ్లకేమి చేతనౌను?! అని మీరే వారి రన్స్ మొత్తం కొట్టేస్తున్నారు. వాళ్లు క్రీజ్‌లో దిగే అవకాశం రాకుండా మీరు మ్యాచ్ గెలిచేస్తున్నారు. ఒక్కోసారి వారు బాటింగ్‌కు దిగాల్సి వచ్చినా.. అక్కడ తగినంత రన్స్ టార్గెట్‌గా ఉండవు. 'అయ్యో ఫాస్ట్ బౌలింగ్‌ను ఎదుర్కొని ఎక్కడ దెబ్బలు తగిలించుకుంటారో!'.. 'స్పిన్‌ను ఎదుర్కొనే నేర్పరితనం వారిలో లేదు'.. అని మీ భయం. తథాస్తు దేవతలున్నారు.. మీ భయాలే నిజాలు అవుతున్నాయి. అది క్రికెట్ మ్యాచ్.. ప్రాక్టీస్ చెయ్యాలి.. అసలు మ్యాచ్‌లో పిచ్‌పై దిగాలి. దెబ్బలు తగిలించుకోవాలి. బౌలర్ చేత మాటలు అనిపించుకోవాలి. కసి పెరిగి బాల్‌ను చితకొట్టాలి. అప్పుడే మ్యాచ్. అదే కిక్కు. పిచ్‌పై వారు దిగే ఛాన్స్ ఇవ్వకుండా.. వారి మ్యాచ్ మొత్తం మీరే ఆడిస్తే.. వారు ఎందుకూ కొరగాని సన్నాసులు అయిపోరా?



లైఫ్ కూడా క్రికెట్ మ్యాచ్ లాంటిదే. కాకపోతే ఇండియన్ పోరంబోకు లీగ్ కాదు. ఐపీల్ ఒక టీం కాదు. అది ఒక ఆట కాదు. అది వేరే టాపిక్. మధ్య తరగతి.. ఎగువ తరగతి తల్లిదండ్రులు.. నేడు తమ కోసమే కాకుండా తమ పిల్లలు 'జీవితాంతం కాలిపై కాలు వేసుకొని హాయిగా తినేంత' సంపాదిస్తున్నారు.

ఇటీవల సోషల్ మీడియాలో ఒక తండ్రి తన కొడుకును పాతిపెట్టిన సమాధిపై పడి ఏడుస్తున్న వీడియో... అందరినీ కదిలించింది. 'నీ కోసం ఇన్ని కోట్లు సంపాదించాను కొడుకో.. నువ్వేమో ఇలా అర్ధాంతరంగా ఐపీల్ తొక్కిసలాటలో పోయావు' అని తండ్రి ఏడుస్తున్న వీడియో అది.

మన చుట్టూరా జరిగే ఘటనల నుంచి మనం సరైన పాఠాలను గ్రహించాలి. మీ వయసు 20 అనుకొందాం. మీ తండ్రి మహా బిజీ. మంచి దారో.. అడ్డదారో.. కోట్లు సంపాదిస్తున్నాడు. జీవితాంతం తిని కూర్చున్నా మరో మూడు తరాలకు అది సరిపోతుంది. ఇప్పుడు మీరు కష్టపడి బాటింగ్ చేస్తారా? ఆ మోటివేషన్ వస్తుందా? ఆ అవసరం ఉందా? ఒక యువకుడి లాగా ఆలోచించండి. అందరూ కష్టపడితే.. ఇక ఖర్చుపెట్టేది ఎవరు ఆలోచించరా? మా నాన్నకు లైఫ్‌ను ఎంజాయ్ చెయ్యడం రాదు. నేను ఆ పని చేస్తాను అని డిసైడ్ అయిపోరా?? మీరు ఒంటరి కాదు.. మీ లాగే ఎందరో.

ఒక్కసారి హైదరాబాద్ జూబిలీ హిల్స్‌కు పోదాం. అక్కడ చాలామంది యూత్‌కు రాత్రి పదకొండుకు పొద్దుపుడుతుంది. లేచి.. పబ్బు.. గబ్బు.. డ్రింక్ .. డ్రగ్.. అటుపై రాత్రి రెండిటికి–మూడింటికి.. రోడ్డుపైకి వచ్చి బీర్ బాటిల్‌తోనో, రాళ్లతోనో రోడ్డుపై హంగామా చెయ్యాలి. 300 కిలోమీటర్ వేగంతో బైక్ నడపాలి.

తప్పు వారిదా?

అడిగినంత డబ్బు.. ఖర్చు పెట్టినంత సంపద. తిని తిని, తాగి తాగి బోర్ కొట్టేసింది. తూ.. జీవితం.. డోపామైన్ హై. ఆరు పెగ్గులు కొట్టినా కిక్కు ఎక్కదు. మరి డ్రగ్స్ తీసుకోకపోతే ఎలా? పదో తరగతి నాటికే ముగ్గురు గర్ల్ ఫ్రెండ్స్. ఇప్పుడిక సింగిల్స్ మ్యాచ్ ఏమి రుచిస్తుంది? తనలాంటి ఐదుగురు ఫ్రెండ్స్‌తో కలిసి మొత్తం పది మందితో వైల్డ్ గేమ్ ఆడకపోతే మజా ఎలా వస్తుంది?

'మీరు చెప్పేది ధనికుల పిల్లల సంగతి.. మాది మధ్య తరగతి..' అనే కదా మీ ప్రశ్న? మీరు మధ్య తరగతి అనుకొంటున్నారు. 'మా అమ్మ నాన్న దగ్గర మూడెకరాల పొలం ఉంది. అమ్మితే ఐదో పదో కోట్లు వస్తాయి.. ఇది కాకుండా ఇదిగో ఇంత బంగారు నగలు అని వారి లెక్కలు వారికున్నాయి.

యువత పీర్ ప్రెషర్‌కు ఎప్పుడూ బలవుతుంది. తమ కాలేజీలో ఒకడు బీఎండబ్ల్యూలో వస్తే.. ఇంట్లో వారికి బియ్యం డబ్బులు లేకపోయినా, గంజికి దిక్కు లేకపోయినా బెంజ్.. బీఎండబ్ల్యూ కావాలి అనుకొంటుంది. డిజిటల్ యుగంలో ఇదే అసలు మహమ్మారి..! అయినా.. ఇదేదో ఇప్పుడు కొత్తగా వచ్చింది కాదు మాస్టారు!

చంద్రగుప్త మౌర్యుడు.. బింబిసారుడు.. అశోకుడు. అంతే.. మూడో తరానికి అవుట్. మౌర్యులు.. గుప్తులు.. హుణులు.. కుషాణులు.. ఖిల్జీ.. తుగ్లక్.. మొఘల్.. మొత్తం భారత దేశ చరిత్ర చెప్పే సారం ఇదే. మూడో తరానికి మించి.. ఏ రాజ వంశంలో హీరోలు పుట్టలేదు. నాలుగో తరం నుంచి జీరోలే.. సన్నాసులే. ఆధునిక కాలంలో కూడా అంతే.

జూబిలీ హిల్స్.. బంజారా హిల్స్.. మాదాపూర్.. రాజవంశాల చరిత్ర చూడండి.. తాత గారు గొప్పోడు. మెట్టు మెట్టు ఎక్కి బిజినెస్ సామ్రాజ్యాన్ని నిర్మించాడు. రెండో తరం ఓకే. మూడు కష్టం. నాలుగు ఇంపాజిబుల్. నేను చెబుతున్నది పిల్లల్ని పెంచి పెద్ద చేసే పద్ధతి గురించి మాస్టారు! లోకనాయకుడు కృష్ణుడు అంతటి వాడే కొడుకుల పెంపకంపై దృష్టి పెట్టలేనంత బిజీ అయిపోయి తన తర్వాత తన వంశ నాశనానికి పరోక్షంగా కారణమయ్యాడు.

ఆస్తులు సంపాదించొద్దు అనడం లేదు. కానీ పిల్లలతో సమయం గడపండి. మంచి చెడు తెలియచెప్పండి. ఇవేమీ లేకుండా కేవలం ఆస్తులు సంపాదిస్తే బతుకులో.. మంచు తుపాను ఖాయం. ముసలి వయసులో మనశ్శాంతి కరువవుతుంది. అర్థమయ్యిందా ?

డబ్బున్నా.. పిల్లల్ని పెంచడం ఒక కళ. వారి ఆటను వారిని ఆడనివ్వండి. అపార సంపద ఉన్నా మార్వాడీ.. పార్సీ యూత్ దుకాణానికి ఫ్యాక్టరీకు ఉదయం పదింటికే ఎందుకు పోతున్నారో.. వారి పెంపకం ఏంటో ఒక్కసారి లుక్ వెయ్యండి.

గుర్తుంచుకోండి..

మన పిల్లలు మన జీన్స్ పంచుకొని పుడతారు. అంతకు మించి మనల్ని చూసి నేర్చుకొంటారు. ఆవు / ఎద్దు చేలో పడి మేస్తుంటే.. దూడలు గట్టున మేస్తాయా? పిల్లల్ని పెంచడం ఒక కళ!

వాసిరెడ్డి అమర్నాథ్

● ఎడిటోరియల్

# కొలమానాలు మారిస్తే పేదరికం పోతుందా?


దేశంలో పేదరికం తగ్గిందట! ఎంతలా అంటే అతి పేదరికం రేటు పదేళ్ల వ్యవధిలో ఏకంగా ఇరవై శాతానికిపైగా తగ్గిపోయిందని ప్రపంచ బ్యాంకు ఉవాచించింది. అంటే.. కటిక పేదరికం నుంచి కోట్లాది ప్రజలు కాస్త ఉన్నతస్థాయికి ఎదిగారన్నట్లే. మరి దేశంలో వాస్తవ చిత్రం అలా ఉందా? అంటే ఎవరైనా సరే ఠక్కున లేదు అనే అంటారు. మరెందుకు ప్రపంచ బ్యాంకు అంతపెద్ద అబద్ధాన్ని బయట కొదిలిందంటే.. వాస్తవానికి పేదరికం ఏమీ తగ్గలేదు.. కానీ ప్రపంచస్థాయిలో దాన్ని అంచనా వేసే ప్రమాణాలను (పారామీటర్స్) మార్చడం వల్ల భారత్‌లోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా అతి పేదరికంలో మగ్గుతున్నవారు ఉన్నఫళంగా, తమ ప్రమేయం లేకుండానే దాన్నుంచి బయటపడిపోయారు. కానీ వారి ఆర్థిక స్థితిగతులు, ఆకలి కేకలు మాత్రం ఇప్పటికీ అలాగే కొనసాగుతున్నాయి. ప్రమాణాలను పెంచి పేదరికాన్ని పారదోలామని చెప్పుకోవడం సమంజసం కాదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని దేశాల్లో ప్రజల ఆదాయాలు, జీవన ప్రమాణాలు పెరిగి ఉండోచ్చేమోగానీ.. అన్ని దేశాలను అదే గాటన కట్టి ఒకేలా చట్రంలో బంధించి అతి పేదరికం తగ్గిపోతోందని ప్రకటించడం విడ్డూరం. ఇప్పటివరకు రోజుకు 2.15 లోపు అమెరికన్ డాలర్ల సంపాదన కలిగిన కుటుంబాలను అతిపేదవారిగా ప్రపంచ బ్యాంకు ఇప్పటివరకు గుర్తిస్తోంది. దాన్ని తాజాగా మార్చి మూడు డాలర్లకు పెంచింది. అదేవిధంగా మధ్య ఆదాయ వర్గాలను గుర్తించే కొలమానాన్ని 3.65 నుంచి 4.20 అమెరికన్ డాలర్లకు పెంచింది. ఎగువ మధ్యతరగతి ఆదాయవర్గాల గుర్తింపు కొలమానాన్ని 6.85 నుంచి 8.40 అమెరికన్ డాలర్లకు పెంచింది. ఈ మార్పు ఫలితంగా 2011-12లో 34 కోట్లు (340 మిలియన్లు) దారిద్ర్య రేఖకు దిగువన ఉండగా 2022-23 నాటికి ఆ సంఖ్య 7.5 కోట్లకు (75 మిలియన్లు) తగ్గిపోయింది. అంటే సుమారు 171 మిలియన్ల మంది అతి పేదరికం నుంచి బయటపడి దిగువ మధ్యతరగతి గ్రూపులోకి వచ్చేశారన్నమాట. భారతదేశానికి చెందిన గణాంకాలు పరిశీలిస్తే.. 2011-12లో దేశంలో అతి పేదరికం రేటు 27.1 శాతం ఉంది. ప్రపంచ బ్యాంకు కొలమానం పెంచిన తర్వాత లెక్కల ప్రకారం అది 2022-23 నాటికి అది 5.3 శాతానికి తగ్గింది. 2022-23 నాటికి మన దేశంలో దాదాపు 75.24 మిలియన్ల మంది తీవ్ర పేదరికంలో జీవిస్తున్నారు. 2011-12లో వీరి సంఖ్య 344.47 మిలియన్లు. దీని అర్థం 11 ఏళ్ల వ్యవధిలో సుమారు 269 మిలియన్ల మంది అతి పేదరికం నుంచి బయటపడి దిగువ మధ్యతరగతి వర్గంలో చేరినట్లు భావించాలి. 2024 నాటి గణాంకాలు చూస్తే భారత్‌లో ప్రపంచ బ్యాంకు ప్రమాణాల కంటే తక్కువ ఆదాయంతో జీవించే వారు జనాభాలో 5.44 శాతం మేరకు అంటే 54,695,832 మంది ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అతి పేదరికం రేటు 2011-12లో 18.4 శాతం నుంచి 2022-23లో 2.8 శాతానికి తగ్గింది. అదే సమయంలో పట్టణ ప్రాంతాల్లో ఇది 10.7 శాతం నుంచి 1.1 శాతానికి తగ్గింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అతి పేదరికం వ్యత్యాసం 7.7 శాతం నుంచి 1.7 శాతానికి తగ్గింది. అదే సమయంలో మన దేశ జీడీపీ పరిస్థితి చూస్తే.. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి రేటు కోవిడ్ పూర్వ రేటుతో పోలిస్తే ఐదు శాతం మేరకు తక్కువగానే ఉంది. అదే సమయంలో ప్రపంచ స్థాయిలో విధాన మార్పులు, వాణిజ్య ఉద్రిక్తతలు వంటి అంశాలు భారత్ ఎగుమతులపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని ప్రపంచ బ్యాంకు హెచ్చరించింది. అయితే ఏ కోణంలో చూసినా ఎలా విశ్లేషించినా అంత పెద్దసంఖ్యలో ప్రజలు పేదరికం నుంచి బయటపడినట్లు కనిపించదు. ఎందుకంటే దేశ ప్రజల కనీస ఆదాయాలు చాలాకాలంగా ఎదుగూ బొదుగూ లేకుండానే ఉన్నాయి. అదే సమయంలో రోజురోజుకూ పెరిగిపోతున్న నిత్యావసరాల ధరలు వారి కొనుగోలు శక్తిని తగ్గించేస్తున్నాయి. ఫలితంగా పేదలు పేదలుగానే ఉండిపోతున్నారు. పలు నివేదికలు ఘోషిస్తున్నాయి. భారతదేశం ప్రపంచంలో నాలుగో ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని గొప్పలు చెప్పుకొంటున్నా అదంతా దేశ జనాభాలో పది శాతంలోపే ఉన్న సంపన్న వర్గాల వద్దే పేరుకుపోతోంది. ఆర్థిక వృద్ధి ఫలాలు అట్టడుగు వర్గాల వరకు చేరడంలేదని స్పష్టమవుతున్న ఈ పరిస్థితుల్లో అతి పేదరికం తగ్గిపోయిందని చెప్పడాన్ని గణాంకాల గారడీగా పరిగణించాల్సి ఉంటుంది. ఈ లెక్కలను చూపించి జబ్బలు చరుచుకుంటే అంతకంటే దారుణం మరొకటి ఉండదు. వాస్తవిక దృక్పథంతో వ్యవహరిస్తేనే పేదరికాన్ని తగ్గించే అవకాశం ఉంటుందని పాలకులు గ్రహిస్తే మంచిది.

## రోడ్లు తవ్వి వదిలేశారు

(సత్యంన్యూస్, భామిని)

మండలంలోని పాలిష్‌కోట పంచాయతీ జక్కరగూడ గ్రామంలో రోడ్లను తవ్వి వదిలేయడం వలన వాహనదారులు, ప్రయాణీకులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. గత దశాబ్ద కాలంగా రోడ్లు లేకపోవడం వలన ఈ రహదారిలో రాకపోకలు సాగించాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంటోందని స్థానికులు వాపోతున్నారు. ఈ గిరిజన గ్రామాలకు కాంట్రాక్టర్ గత మూడున్నర నెలలుగా రోడ్డును తవ్వి వదిలేసి పనులు ప్రారంభించకపోవడం వలన గిరిజన గ్రామాల ప్రజలు పూర్తిగా ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిపై అధికార యంత్రాగం, నాయకులు స్పందించి రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.





షైనింగ్ స్టార్స్ - అవార్డ్స్ 2025 కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌ను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సోమవారం విశాఖ ఎయిర్‌పోర్ట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యలను ఆయనకు వివరించారు.

- సత్యంన్యూస్, పాతపట్నం

## బదిలీల కౌన్సెలింగ్ మాన్యువల్‌గా చేపట్టాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సెకండరీ గ్రేడ్ టీచర్లు, భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల బదిలీల కౌన్సిలింగ్ మాన్యులుగా చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం డీఈవో కార్యాలయం ముందు నిరాహార దీక్షలు చేశారు. బదిలీల ప్రక్రియ ప్రారంభం కాకముందే రాష్ట్రస్థాయిలో ఈ విషయమై ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆందోళన పిలుపు ఇవ్వగా ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి మాన్యువల్ కౌన్సిలింగ్‌కు మాట ఇచ్చి ఇప్పుడు వెబ్ కౌన్సిలింగ్ అంటూ మాట తప్పడంతో ఉపాధ్యాయ సంఘాలు భగ్గుమన్నాయి. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపుతో శ్రీకాకుళం డీఈఓ కార్యాలయం ముట్టడికి ఉపాధ్యాయులు వేలాదిగా తరలి వచ్చారు. ఆదివారం డీఈఓ కార్యాలయం ముట్టడి కార్యక్రమం విజయవంతం చేయడంతో రెండో రోజు నిరాహార దీక్షలు కూడా ఉపాధ్యాయులు తరలిరావడం ప్రభుత్వ అధికారులకు చెమటలు పట్టిస్తోందన్నారు. మాట తప్పవద్దు మడమ తిప్పవద్దంటూ ఉపాధ్యాయుల నినాదాలతో ఉమెన్స్ కాలేజీ రోడ్డు దద్దరిల్లిందన్నారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ నాయకులు ఎస్.కిషోర్‌కుమార్, మజ్జి మదన్మోహన్‌ల ఆధ్వర్యంలో ఈ నిరాహార దీక్ష నిర్వహించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి మాట్లాడుతూ సంఖ్యాపరంగా అత్యధికంగా ఉన్న ఎస్జీటీ ఉపాధ్యాయులకు వెబ్ కౌన్సిలింగ్ చాలా ఇబ్బందికరమన్నారు. వేలాదిగా ఆప్షన్స్ పెట్టుకోవడం చాలా ఇబ్బందికరమైన పరిస్థితి అని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల బదిలీలలో న్యాయబద్ధమైన డిమాండ్‌ను ఖచ్చితంగా ప్రభుత్వం అమలు చేసి తీరాలన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ బదిలీల ప్రక్రియ ప్రారంభం కాకముందే ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడాన్ని తప్పుబట్టారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధవళ సరస్వతి మాట్లాడుతూ పోరాటమార్గమే మనకు సరైన మార్గమని, ఈమధ్య అధికారులకు మాట ఇచ్చి తప్పడం పరిపాటిగా మారిందని పేర్కొన్నారు. ఏపీటీఎఫ్ 1938 నాయకులు టి.చలపతిరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల న్యాయమైన కోర్కెలను, అది కూడా బదిలీలకు సంబంధించి ఇచ్చిన మాట తప్పడం సరైనది కాదన్నారు. పిఆర్‌టి నాయకులు పి.రాజశేఖర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వ్యతిరేక వైఖరి సరైనది కాదని, ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్ మాన్యువల్‌గా చేస్తే వచ్చే నష్టం ఏమిటని ప్రశ్నించారు. మాన్యువల్ కౌన్సిలింగ్ చేయాల్సిందిగా మూడవరోజు ఉద్యమం ఉపాధ్యాయులతో డిఇఓ కార్యాలయం ముందు ఉధృతంగా సాగుతున్నదన్నారు. కార్యక్రమంలో బి.శ్రీరామ్మూర్తి, తంగి మురళీమోహన్ రావు, దానేటి కేశవరావు, బి ధనుంజయ్‌రావు, జి.రమణ, ఎస్‌వి.రమణ, గరుగుబెల్లి గోపాలరావు, బి.రవి, బి.వెంకటేశ్వర్లు, డి.శివరాం ప్రసాద్, పి కాశీ విశ్వనాథరావు, బోనేల రమేష్, వి.శరత్‌బాబు, ఎన్ లక్ష్మణరావు, జే.మురళి, పి.ప్రతాప్ కుమార్, పిసిని వసంతరావు, జి భాస్కర్, తిరుపతిరావు, టి మురళీమోహన్, గొంటి గిరిధర్, చావలి శ్రీనివాస్, పి.తిరుమలరావు, సదాశివుని శంకరరావు, వి.నవీన్ కుమార్, ఉమాశంకర్, బి.డిల్లేశ్వరరావు, పి శ్రీరామ్మూర్తి, ఎన్.శ్రీనివాస్, అన్నాజీరావు, అశోక్‌కుమార్, చిట్టి త్రినాధరావు, నాగభూషణరావులు పాల్గొన్నారు.

## మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు

(సత్యంన్యూస్, కొత్తూరు)

భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలకు నిలయమైన తెలుగునేలపై పుట్టి, మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాలు కొత్తూరు గ్రామ సర్పంచ్ పడాల కృష్ణవేణి అన్నారు. ప్రముఖ మీడియా ఛానల్ సాక్షిలో కెఎస్‌ఆర్ లైవ్ షోలో జర్నలిస్ట్ కృష్ణంరాజు, కొమ్మినేని రాష్ట్ర రాజధాని అమరావతి మహిళలను, మహిళా రైతులను కించపరుస్తూ "వేశ్యలు" అనే పదాన్ని కూడా వాడారన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధిని చూడలేని జగన్మోహన్ రెడ్డి ఇలాంటి తప్పుడువ్యక్తులతో, తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కృష్ణవేణి అన్నారు. అలాగే మీడియా ముసుగులో వైసీపీ సానుభూతిపరులుగా చెలామణి అవుతున్న కొమ్మినేని, కృష్ణంరాజులపై అలాగే ఇటువంటి వారిని ప్రోత్సహిస్తున్న సాక్షి యాజమాన్యం పైన కూడా చర్యలు తీసుకోవాలని కొత్తూరు తెలుగు మహిళా నాయకురాళ్లు డిమాండ్ చేస్తూ కొత్తూరు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కొత్తూరు సర్పంచ్ పడాల కృష్ణవేణితోపాటు కొత్తూరు మాజీ ఉప సర్పంచ్ చోడవరపు శైలజ, వార్డుమెంబర్ చోడవరపు సంధ్యారాణి, ముగితి లక్ష్మి, పాలవలస సుజాత, కొత్తూరు సర్పంచ్ ప్రతినిధి పడాల లక్ష్మణరావు, టీడీపీ సీనియర్ నాయకులు అగతముడి మాధవి తదితరులున్నారు.




## బీచ్‌లో అందాల వింక్ బ్యూటీ షో

మలయాళ బ్యూటీ ప్రియా ప్రకాష్ వారియర్ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. గత ఐదు ఏళ్లుగా ఈ అమ్మడు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతూనే ఉంది. ఒరు ఆదార్ లవ్ సినిమాలో ఈ అమ్మడు పేల్చిన ముద్దు గన్ కుర్రాళ్ల గుండెల్లో తూట్లు పొడిచింది. ఇక ఈ అమ్మడు కొంటెగా కన్ను గీటడంతో ఆ భాష.. ఈ భాష అని తేడా లేకుండా ప్రతి ఒక్క భాషకు చెందిన కుర్రాళ్లు గిలగిల కొట్టుకున్నారు. అందాల ముద్దుగుమ్మ ప్రియా ప్రకాష్ వారియర్ ఆ రెండు పనులతో ఒక్కసారిగా ఫేమస్ అయింది. దాంతో సినిమాల్లో ఆఫర్లు కూడా వచ్చాయి. కానీ ప్రియా ప్రకాష్ వారియర్‌కి ఆశించిన స్థాయిలో సక్సెస్ లు దక్కలేదు. దాంతో ఆఫర్లు సైతం ఎక్కువ రాలేదు. సోషల్ మీడియా ద్వారా వచ్చిన గుర్తింపుతో ఈ అమ్మడు ఒక మోస్తరు సినిమాల్లో నటించే అవకాశాలు దక్కించుకున్నా అవి పెద్దగా ఈ అమ్మడి కెరీర్‌ను నిలబెట్టలేక పోయాయి. అయినా కూడా ఈ అమ్మడు ఇండస్ట్రీలో కొనసాగడంకు కారణం సోషల్ మీడియాలో ఈమె షేర్ చేసే ఫోటోలు, వీడియోలు అనడంలో సందేహం లేదు. హీరోయిన్‌గా ప్రియా ప్రకాష్ వారియర్‌ను సినిమాల్లో చూడటం కంటే ఇలా ఇన్‌స్టాగ్రామ్‌లో అందాల ఆరబోత ఫోటోల్లో చూడటం ఎక్కువగా జరుగుతూ ఉంటుంది. తాజాగా ఈమె బీచ్ ఫోటోలను షేర్ చేయడం ద్వారా మరోసారి అందరి దృష్టిని ఆకర్షించింది. బీచ్‌లో అందాలు ఆరబోస్తున్న ఈ అమ్మడు ఆకట్టుకుంది. సాధారణంగానే ముద్దుగుమ్మలు బీచ్‌లో అందంగా కనిపిస్తూ ఉంటారు. అలాంటిది ప్రియా ప్రకాష్ వారియర్ మినీ స్కర్ట్ ధరించి, ఒక మోస్తరు బికినీ మాదిరిగా ఉన్న ఔట్ ఫిట్‌లో చూపరులను అలరించింది. ఆకట్టుకునే అందంతో పాటు, ముద్దుగుమ్మ స్టైలిష్ గా ఫోటోలకు ఫోజ్‌లు ఇవ్వడం వల్ల ఫోటోలు కాస్త వైరల్ అయ్యాయి. ప్రియా ప్రకాష్ వారియర్ స్కిన్ షో చేయడం కొత్తేం కాదు. అయినా కూడా ఈ ఫోటోలు ఆమె అందంగా కనిపిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ సారి ఇంకాస్త ఎక్కువ అందంగా అనిపించే విధంగా సోషల్ మీడియాలో ఈమె ఫోటోలు తెగ వైరల్ అవుతున్నాయి. ప్రియా ప్రకాష్ వారియర్ ఇంత అందంగా ఉన్నా లక్ కలిసి రావడం లేదు. ఈ అమ్మడికి అందాల ఆరబోత చేసే ఆసక్తి ఉన్నా సినిమాల్లో ఎక్కువగా ఆ అవకాశాలు రావడం లేదు అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ముందు ముందు అయినా ప్రియా ప్రకాష్ వారియర్‌కి ఆఫర్లు రావాలని అభిమానులు బలంగా కోరుకుంటున్నారు. ఇలాంటి ఫోటో షూట్స్‌ను కంటిన్యూ చేస్తే కచ్చితంగా ముందు ముందు అయినా ఈమెకు ఆఫర్లు వస్తాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ప్రస్తుతం ముద్దుగుమ్మ ఒక మలయాళ సినిమాను చేస్తుంది. మరో వైపు తెలుగు, తమిళ భాషల్లో సినిమాలు చర్చల దశలో ఉన్నాయి. త్వరలోనే ఈ అమ్మడి సినిమా వచ్చి విజయాన్ని సొంతం చేసుకుని మరిన్ని ఆఫర్లు దక్కించుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు.



**- తుపాకి.కామ్ సౌజన్యంతో...**

మహేష్ నిద్రకు ఆగలేడు..

## షాట్స్ వేగంగా తీసి పంపించేయండి!

సూపర్‌స్టార్ హీరోగా"గూఢచారి117" సినిమా షూటింగ్ మద్రాస్‌లోని స్టూడియోలో వేసిన "విమానం ఇంటీరియర్ సెట్"లో జరుగుతోంది. సమయం అర్ధరాత్రి 2 గంటలు. బాలనటుడైన మహేష్ బాబుతోసహా దాదాపు సినిమాలోవున్న నటీనటులందరూ ఆ ఫ్లైట్ సెట్లో ఉన్నారు. ఫ్లైట్ ఎక్స్‌టీరియర్ వర్క్ హైదరాబాద్ బేగంపేట్ ఎయిర్‌పోర్ట్‌లో జరిగింది. కృష్ణగారు డైరెక్టర్‌గారితో "ముందు మహేష్ షాట్స్ తీయగలిగితే తీసి పంపించేయండి. నిద్రకి ఆగలేడు. నేను కావాలంటే తెల్లవారేవరకూ ఉంటాను" అని నవ్వుతూ చెప్పారు. ఆ సినిమా షూట్ జరుగుతున్నప్పుడు మహేష్‌బాబు టక టకా డైలాగులు చెబుతుంటే కృష్ణగారు చూస్తూ భలే మురిసిపోతుండేవారు. కథప్రకారం టెర్రరిస్ట్ భానుప్రియ గ్రూప్ ఫ్లైట్ హైజాక్ చేసి వాళ్ళ డిమాండ్స్ కోసం ఒక్కొక్కరినీ చంపుతుంటారు. ఆ ప్రోసెస్‌లో భాగంగా కొత్తగా పెళ్ళైన ఓ జంటలోని యువకుడిని చంపుతారు. మా మిత్రుడుపురం రాధాకృష్ణ (తర్వాతికాలం లో"చిరంజీవులు" సినిమాకి దర్శకత్వం వహించాడు) ఆ యువకుడి పాత్ర పోషిస్తే అతని జంటగా ఓ కొత్తమ్మాయి వేసింది. డైరెక్టర్ గారు ఆ అమ్మాయితో "టెర్రరిస్టులు మీ ఆయన్ని కాల్చేశారు అది చూసి నువ్వు కెవ్వుమని అరిచి పడిపోవాలి"అని చెప్పా రు. సెట్లో ఒకరిద్దరు గురకపెడుతున్న వాళ్ళను, నిద్రకు జోగుతున్న వాళ్ళను లేపి టేక్ అని అరిచాము. డైరెక్టర్ గారు యాక్షన్ చెప్పగానే రాధాకృష్ణ బుల్లెట్ తగిలినట్లు అరిచి పడిపోతే అతన్ని చూసిన ఆ అమ్మాయి ఒక్కసారిగా తల పైకెత్తి తన చెవులురెండూ మూసుకుని "కెవ్వు" అనే పదం పెద్దగా పలుకుతూ పడిపోయింది. అంతే దెబ్బకి సెట్లో అందరికీ నిద్ర మత్తు ఒదిలిపోయింది. విరగబడి నవ్వారందరూ. మీరు చెప్పిందేకదా చేశాను ఎందుకు నవ్వుతున్నారు అన్నట్లు చూసిందా అమ్మాయి. డైరెక్టర్ గారు "కెవ్వుమని అరవమంటే" కెవ్వా" అని అనక్కర్లేదమ్మా. అరిచిపడిపోతే చాలు" అని మళ్ళీ యాక్షన్ చెప్పారు. మళ్ళీ సెకెండ్ టేక్‌లో కూడా ఆ అమ్మాయి "కెవ్వా" అంటూ దీర్ఘం తీయడంతో మళ్ళీ నవ్వులేనవ్వులు. మూడో టేక్‌కి అర్ధమైందామెకి. టేక్ ఓకే అయ్యింది. అప్పటి నుండి ఆ అమ్మాయి "కెవ్వుకుమారి" అయ్యింది. కొన్ని తెలుగు తమిళ సినిమాలలో నటించిన ఆ అమ్మాయి తరువాత కనిపించలేదు. నేను దర్శకత్వం వహించిన "బ్లేడ్‌బాబ్జీ" సినిమాలో.... అల్లరి నరేష్ బృందం బ్యాంక్ రాబరీ చేసి పోలీసులనుండి తప్పించుకున్న ఆనందంలో వైజాగ్ బీచ్ ఒడ్డున లంగరేసివున్న ఓ చిన్న షిప్ లో మందుకొట్టి పడుకుని తెల్లారి లేచి చూసేసరికి షిప్ సముద్రం మధ్యలో ఉంటుంది. షాక్ అయ్యిన వాళ్ళు చేతులు చెవులకు ఆనించి "కెవ్వు" అని అరుస్తారు పెద్దగా. అలా అరిపించటానికి ఆనాటి కెవ్వు కుమారి "కెవ్వే" నాకు ప్రేరణ. ఆ "కెవ్వు" ఆనాడు సెట్లో అందరినీ ఎలా నవ్వించిందో అలాగే ఈ "కెవ్వు" థియేటర్‌లో ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించింది. వెతకాలేగానీ మనచుట్టూ జరిగే సంఘటనల్లో, చుట్టూ ఉండే మనుషుల్లో ఎన్నో నవ్వులు దాక్కునివుంటాయి. మనిషికి కష్టమొచ్చినపుడు కష్టపడకా,దుఃఖం వచ్చినపుడు దుఃఖపడకా తప్పదు. కానీ మిగిలిన విలువైన సమయాన్నికూడా భారంగా ఎందుకు ఖర్చు చెయ్యటం? ఏమాత్రం "ఖర్చు"లేని "నవ్వు" ని ముఖానికెందుకు దూరం చెయ్యటం? సాధ్యమైనన్ని నవ్వుల్ని పోగేసుకుని బ్రతికేద్దాం.




- దేవీ ప్రసాద్.

# అక్కచెల్లెళ్ల సంబరం.. చూడాలి వైభవం

(మొదటిపేజీ తరువాయి)

పైడితల్లి అమ్మవారికి సిరిమానోత్సవం జరగడం మనకు తెలుసు. కేవలం సిరిమానును చూడ్డానికే మన జిల్లా నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివెళ్తారు. సిరిమాను మీద అమ్మవారి కోవెల ప్రధాన అర్చకుడు కూర్చుంటాడు. ప్రతీ ఏడాది ఈ సిరిమాను (ఒంపులు లేని పొడుగైన చింతమాను ఎక్కడుంటుందనేది అమ్మవారే అర్చకుడికి కలలోకి వచ్చి చెబుతుందని నమ్మేవారున్నారు. ఇన్నాళ్లయినా, ఇన్నేళ్లయినా ఇప్పటికీ అంత పెద్ద సిరిమానుకు చెట్టు దొరకడం విశేషమే. ఇక శ్రీకాకుళం నగరానికి ఈ సిరిమాను సంబరం అంటే ఏంటో తెలియదు. కానీ పదేళ్లకోసారి పాత శ్రీకాకుళం ప్రాంతం అంటే.. జిల్లాపరిషత్ కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వెనుక భాగం కునుకుపేట వరకు ఉండే ప్రాంతంలో ఈ సిరిమానోత్సవాన్ని జరుపుతున్నారు. 2015 తర్వాత 2025 అంటే.. ఈ ఏడాది జూన్ 10న సిరిమాను పాతశ్రీకాకుళం ప్రాంతంలో భక్తులకు దర్శనమివ్వబోతుంది. విజయనగరం మొత్తం ఒక సిరిమాను తిరిగితే.. పాతశ్రీకాకుళంలో రెండు సిరిమానులు తిరగనున్నాయి. ఐదుగురు అక్కచెల్లెళ్లుగా పేరొందిన పెద్దమ్మ, ముత్యాలమ్మ, నూకాలమ్మ, దుర్గమ్మ, సన్నాలపోలమ్మ అమ్మవార్ల పేరిట నిర్వహించే ఈ సిరిమానోత్సవంలో నూకాలమ్మకు, పెద్దమ్మతల్లికి రెండు సిరిమానులు మంగళవారం కనువిందు చేయనున్నాయి.

### అనుగ్రహమో.. యాదృచ్ఛికమో?

రెండు సిరిమానుల్లో నూకాలమ్మ సిరిమానుకు సంబంధించిన నక్కవీధి సందులో ఉన్న తెలుకలవీధిలో పొలుమూరు వారి ఇంటి నుంచి బయల్దేరుతుంది. తరతరాలుగా నూకాలమ్మను కొలుస్తున్న ఈ కుటుంబ పెద్దే సిరిమాను మీద ఉండాలన్న సంప్రదాయం నడుస్తుంది. అమ్మవారి అనుగ్రహమో, లేదూ అంటే యాదృచ్ఛికమో తెలీదు గానీ ఈ ఏడాది పొలుమూరు వారి కుటుంబం నుంచి అచ్చుతరావు అనే వ్యక్తి ఈ సిరిమాను మీద కూర్చునే అవకాశాన్ని దక్కించుకున్నారు. సిరిమాను మీద కూర్చునే వ్యక్తిని సాక్షాత్తు అమ్మవారి లానే భక్తులు ఆ రోజు కొలుస్తారు. వాస్తవానికి పొలుమూరు కుటుంబానికి చెందిన రామకృష్ణ అనే వ్యక్తి నూకాలమ్మ సిరిమాను మీద కూర్చోవాలి. కానీ హైదరాబాద్ ఇన్‌కమ్ టాక్స్ డిపార్ట్‌మెంట్‌లో పని చేసిన రామకృష్ణకు కొద్ది క్రితం రోడ్డు ప్రమాదంలో ఫ్రాక్చర్‌లు అయ్యాయి. అపోలోలో చికిత్స పొందిన తాను ప్రస్తుతం సిరిమాను మీద కూర్చోడానికి సిద్ధంగా ఉన్నానని చెబుతున్నా జరగరానిది జరిగితే అసలు పొండగ వాతావరణం దెబ్బతింటుందని రామకృష్ణను కాదని అచ్చుతరావును ఇప్పుడు నూకాలమ్మ సిరిమాను మీద కూర్చోబెడుతున్నారు. రామకృష్ణకు ఈ అవకాశం కోల్పోగా, అచ్చుతరావు అనూహ్యంగా ఈ అదృష్టాన్ని దక్కించుకున్నారు. ఇక పెద్దమ్మతల్లి సిరిమానును మహిళా పోలీస్ స్టేషన్ దగ్గరలో ఉన్న మావూరు వారి కుటుంబ సభ్యులు అధిష్టిస్తారు. మావూరి చిట్టిబాలయ్య అనే వ్యక్తి పెద్దమ్మతల్లి సిరిమాను మీద కూర్చుంటారు. గత కొన్నేళ్లుగా ఆయనే కొనసాగుతున్నారు. రెండు నెలల క్రితం ఈయన అకస్మాత్తుగా చనిపోయారు. దీంతో కుమారస్వామి అనే వ్యక్తిని ఈ సిరిమాను మీద కూర్చోబెట్టడానికి సిద్ధంచేశారు. ఇది కాకుండా బాదుర్లపేట కొండక కుటుంబం నుంచి అంజలి రథం మీద ఒకరు కూర్చుంటారు. అసలు ఈ అంజలి రథం అంటే ఏమిటి? దీంతో పాటు దండివీధి నుంచి బయల్దేరే ఏనుగు ఎలా ఉంటుంది? నక్కవీధి నుంచి పయనమయ్యే పడవలో ఎవరుంటారు? కలెక్టర్ బంగ్లా దగ్గర నుంచి మొదలయ్యే మహిషాసురమర్ధినిని ఎవరు నడిపిస్తారు? వంటివి తెలుసుకోవాలంటే మంగళవారం మధ్యాహ్నం నుంచి మొదలయ్యే ఈ సిరిమానోత్సవాన్ని చూడాల్సిందే.

### కమిటీ అధ్యక్షుడిగా డీపీ దేవ్ హ్యాట్రిక్

1985 నుంచి జరుగుతున్న సిరిమాను ఉత్సవాల కోసం ఇప్పుడున్న జనరేషన్‌లో కొందరికి తెలుసు. 1985లో డాక్టర్ సూర్యలింగం ఈ కమిటీకి అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఆ తర్వాత పదేళ్లకు 1995లో డాక్టర్ వండాన శేషగిరిరావు నేతృత్వం వహించారు. అక్కడి నుంచి 2005, 2015, 2025ల్లో రిటైర్డ్ ఎమ్మార్వో డీపీ దేవ్ కమిటీ బాధ్యతలు మోస్తున్నారు. వరుసగా మూడు పర్యాయాలు సిరిమాను పర్యాయాలు సిరిమాను కమిటీ అధ్యక్షుడిగా ఉండటం ఒక రికార్డు 1932లో తొలిసారిగా పాతశ్రీకాకుళం ప్రాంతంలో సిరిమాను బయల్దేరింది. పాతబస్టాండు నుంచి కలెక్టర్ బంగ్లా వరకు ఉన్న ప్రాంతాన్ని అప్పట్లో పాత శ్రీకాకుళమనేవారు. ఆ తర్వాత అది జిల్లాపరిషత్ నుంచి కునుకుపేటగా నిర్ధారించారు. ఇప్పటికీ పాతబస్టాండ్ ప్రాంతం నుంచి కలెక్టరాఫీస్ వరకు ఉన్న నివాసాల్లో జనాల ఆధార్ కార్డులు తీస్తే పాతశ్రీకాకుళం వార్డు అనే ఉంటుంది. ఆర్టీసీ కాంప్లెక్స్ బలగ ప్రాంతానికి షిఫ్ట్ అయిన తర్వాత మాత్రమే శ్రీకాకుళంలో కొత్త ప్రాంతాలు ఏర్పడ్డాయి. అప్పట్లో అక్షరాస్యత తక్కువగా ఉండటం వల్ల కలరా, మలేరియా వంటి వ్యాధుల నుంచి రక్షించేది అమ్మవార్లేనని నమ్మేవారు. అందుకే 1932 ప్రాంతంలో పాతశ్రీకాకుళం ఏరియాలో ఈ వ్యాధులు ప్రబలినప్పుడు ఈ ఐదుగురు అక్కచెల్లెళ్లకు పండగలు నిర్వహిస్తే తగ్గుతుందన్న నమ్మకంతో సిరిమాను పండగ ప్రారంభమైందని చెబుతారు. ఆ తర్వాత పదేళ్లకు జరిగిందో తేదో తెలీదు గానీ 1963లో మాత్రం ఒకసారి సిరిమానోత్సవం జరిగింది. అయితే స్థానికులు కొట్టుకోవడంతో శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని కొన్నాళ్లపాటు సిరిమానును నిర్వహించ లేదు. ఆ తర్వాత మళ్లీ 1985లో ఈ పండగలు ప్రారంభం కాగా, ఇప్పటి వరకు కొనసాగుతూ వస్తున్నాయి.

### 2.50 కిలోమీటర్లు సిరిమాను యాత్ర

గత నెల 5న గ్రామ దేవతల సిరిమాను ఉత్సవం ప్రారంభం కాగా, మంగళవారం దీని అనుపుతో ముగుస్తుంది. జిల్లాపరిషత్ కార్యాలయం నుంచి ప్రారంభమై దేసెళ్లవీధి, నక్కవీధి, దండివీధి, సంతోషిమాత జంక్షన్, మావూరివీధి, బాదుర్లపేట, కొత్తపేట, కునుకుపేట వరకు వెళ్లి మళ్లీ జిల్లాపరిషత్‌కు చేరుకుంటుంది. సుమారు 2.50 కిలోమీటర్లు సాగే ఈ సిరిమాను యాత్ర కోసం కమిటీ అధ్యక్షుడు డీపీ దేవ్, కార్యదర్శి మావూరి శేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్లు నక్క శంకరరావు, కళ్లేపల్లి సోంబాబు, ఎల్.రామలింగేశ్వర స్వామి, కర్రి రంగాజీదేవ్, దేసెళ్ల గోవింద మల్లిబాబు, ముప్పన శ్రీనివాసరావు, గుంటముక్కల పాపారావు, మింద్రాన రమేష్, అడపాక రాంబాబు, దాసరి తిరుమలరావు, సాధు గణేష్, గెంజి తాతారావు, గంగు పెద్దరమణ, ఆదినారాయణ, అశ్వినీ కుమార్, నక్క రవికుమార్, లోకనాథం నాగరాజు అన్ని ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

### సిరిమానును ఇలా గుర్తించారు..

ఒక్కో సిరిమాను 32 అడుగులు పొడవుండాలన్న సూత్రం నడుస్తుంది. అది కూడా చింతమాను అయివుండాలని గతం చెబుతుంది. 32 అడుగుల చింతచెట్టు ఎక్కడుంటుందని నిర్వాహక బృందం వెతికితే అంపోలులో ఉన్నట్టు గుర్తించారు. అయితే అంత చెట్టును నరికిన దగ్గర్నుంచి నగరానికి తరలించేవరకు దాని పవిత్ర చెడకుండా తీసుకురావాలి. ఎందుకంటే నెల రోజుల పాటు ఈ సిరిమానును స్థానికులు పూజిస్తారు. దీంతో కష్టతరమవుతుందని భావించిన నిర్వాహక బృందం మరింత ధీటుగా అన్వేషించగా ఖాజీపేట పంప్‌హౌస్‌లో ఉన్నట్టు తెలియడంతో అక్కడి నుంచి తీసుకువచ్చారు. అయితే ఇప్పుడు ఈ రెండు సిరిమానులను నిలబెట్టి ఊరేగించే బళ్లు కావాలి. స్వయంగా అమ్మవారిని తమ బండి ఎక్కించి తిప్పుతామన్న భావన ఇప్పటికీ బలంగా ఉండటం వల్ల బూరవిల్లి నుంచి ఒక బండి, సారవకోట మండలం కిన్నెరవాడ నుంచి మరో బండి ఇద్దరు దాతలు ఇచ్చారు.

అర్జీల పరిష్కారానికి

# చర్యలు తీసుకోవాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అర్జీలు పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో ఆయన అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్జీలపై నాణ్యమైన ఎండార్సుమెంటు వేయాలని ఆదేశించారు. పంచాయతీ రాజ్, మున్సిపల్ కార్పొరేషన్, ఎక్సైజ్, తదితర శాఖలకు సంబంధించి అర్జీలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సోమవారం స్వీకరించిన అర్జీలలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, డ్వామా, మహిళా శిశు సంక్షేమం, రిజిస్ట్రేషన్, సర్వ శిక్షా అభియాన్, మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా పంచాయతీ, ఎపిఈపీడిసియల్, జిజిహెచ్, విభిన్న ప్రతిభావంతులు, తదితర శాఖల సమస్యలపై అర్జీలు స్వీకరించారు. అర్జీలు స్వీకరణలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సాక్షి ఆస్తుల ధ్వంసం

# అధికార దుర్నీతికి పరాకాష్ట

- వైకాపా జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్ -

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



సాక్షి ఛానల్‌లో అమరావతిపై జరిగిన చర్చను వివాదాస్పదంగా చిత్రీకరిస్తూ, టిడిపి కార్యకర్తలు ఛానల్ కార్యాలయాలపై దాడులకు దిగిన తీరును తీవ్రంగా ఖండిస్తూ వైకాపా శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ స్పందించారు. ఇది అధికార దౌర్జన్యానికి పరాకాష్టగా అభివర్ణించారు. ఒక చర్చా కార్యక్రమాన్ని కారణంగా చూపి, ఆస్తుల ధ్వంసం, ఉద్యోగులపై దాడులకు పాల్పడడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. చర్చలో వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజుపై పోలీసులు ఫిర్యాదులు తీసుకున్నా, సాక్షి యాజమాన్యం వాటికి తమకు సంబంధం లేదని ఇప్పటికే వివరణ ఇచ్చింది, అయినా దాడులు కొనసాగుతున్నాయని ధర్మాన పేర్కొన్నారు. చట్టపరంగా ఎలాంటి చర్యలైనా తీసుకో వచ్చు, కానీ మీడియా ఆస్తులపై దాడులు చేయడం పునరావృతం కానే ఉండకూడదు. ఇది ప్రజాస్వామ్యానికి గాయంగా భావించాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కొమ్మినేనిని విడుదల చేయాలని కృష్ణదాస్ డిమాండ్ చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన నడుస్తోందని, రాజకీయ ప్రత్యర్థులను అణచివేయడానికి ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగిస్తుందని మండిపడ్డారు.




అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే

# ప్రతిభ తప్పనిసరి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఉన్నత స్థాయి ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి యువతలో సూక్ష్మ పరిశీలన, ఉత్తమ ప్రతిభ తప్పనిసరిని శిష్టకరణ సంఘం నాయకులు పోలుమహంతి ఉమామహేశ్వరరావు హితవు పలికారు. ఇటీవల జరిగిన పది, ఇంటర్ పబ్లిక్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన శిష్టకరణ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ఆదివారం స్థానిక శిష్టకరణ భవన్‌లో 'శిష్టరత్న' అవార్డుల ప్రధానం జరిగింది. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గతంలో సంఘ నాయకులు చేసిన పోరాటాల ఫలితంగా బీసీ సాధించిన కారణంగా నేడు ఎందరో పేద విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో విద్య, ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని గుర్తు చేశారు. కేంద్ర స్థాయిలో కూడా అవకాశాలను పొందడానికి, ఓబీసీ సాధనకు అలుపెరుగని పోరాటాలు చేస్తున్నామని, మరికొద్ది నెలల్లో శిష్టకరణాలకు తీపి కబురు లభించే అవకాశం రానుందన్నారు. రిటైర్డ్ డీఈవో బలివాడ మల్లేశ్వరరావు మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే ఎంచుకున్న లక్ష్యంకోసం నిరంతర సాధన చేయాలంటూ పలు మెలకువలు తెలిపారు.

### ప్రతిభావంతులకు 'శిష్టరత్న' ప్రధానం

కూర్మన్న-పోలమ్మాయి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ఆరికతోట కనకరాజు నేతృత్వంలో ఇటీవల జరిగిన పది, ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కుల సాధించిన శిష్టకరణ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందించి అభినందించారు. పదో తరగతిలో 592 మార్కులు సాధించిన వాంద్రంగి రమన్ రితేజ్, ఇంటర్‌లో 984 మార్కులు సాధించిన రఘుపాత్రుని అనుదీప్, ఖరగ్‌పూర్ ఐఐటీలో ఉత్తమ ర్యాంకు సాధించిన కొర్లాం సాయిహర్షలతో పాటు మరో 25 మందికి జిల్లా శిష్టకరణ సంఘం ఆధ్వర్యంలో శిష్టరత్న ప్రతిభ పురస్కారం, సర్టిఫికెట్, మెమెంటోలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా సంఘం అధ్యక్షులు డబ్బీరు శ్రీనివాసరావు (వాసు) అధ్యక్షతన జరిగిన అవార్డు ప్రధానోత్సవంలో సంఘ నాయకులు సదాశివుని కృష్ణ, బెహరా వెంకట సత్యనారాయణమూర్తి, సదాశివుని రాంబాబు, ఆదినారాయణ, బి.శ్రీనివాస్ పట్నాయక్, బి.రామచంద్రరావు, ఆర్.వి.ఎన్.శర్మ, పెదపెంకి శ్రీరామ్ కుమార్, డబ్బీరు వెంకటరావు, శిష్టకరణ కన్వీనర్ ఎస్.వి.డి.వినోద్, లాల్, డి. దివాకర్, రాధా పట్నాయక్, కె.సౌజన్య పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా ట్రెజరర్‌గా శివ

ఆదివారం మధ్యాహ్నం సంఘ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో జిల్లా సంఘం ముఖ్య సలహాదారుగా డాక్టర్ ఆరికతోట కనకరాజును, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉరిటి కిరణ్ బాబును, కోశాధికారిగా బలివాడ శివప్రసాద్‌ను నియమిస్తూ కమిటీ తీర్మానం చేసింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఆహ్వానితులు అభినందించారు.


# ప్రతిభను గుర్తించి వెన్ను తట్టి ప్రోత్సహించాలి

- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- రాష్ట్ర అభివృద్ధి విద్యతోనే సాధ్యం
- కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రతిభను గుర్తించి, వెన్ను తట్టి ప్రోత్సహించాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ సూచనలతో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇటీవల విడుదలైన ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులకు మండలాల వారీగా ఎంపిక చేసి షైనింగ్ స్టార్స్ అవార్డులతో సత్కరించే కార్యక్రమాన్ని స్థానిక 80 అడుగుల రోడ్డులోని ఆనందమయి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దీనకర్ పుండ్కర్, నరసన్నపేట, శ్రీకాకుళం ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గొండు శంకర్‌తో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మాట్లాడుతూ విద్యార్థులకు అవార్డులు ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. బాగా చదువుకొని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకే కాకుండా వారి గ్రామానికి, జిల్లాకి, తద్వారా రాష్ట్రానికి విద్యార్థులు మంచి పేరు తీసుకురావాలని మంత్రి అన్నారు. కసితో చదివి గెలుపు సాధించే దిశగా అడుగులు వేయాలని సూచించారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ విద్యా శాఖపై ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు. ఇటువంటి మంచి కార్యక్రమం ఏర్పాటు చేసినందుకు విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు అభినందనలు తెలిపారు. దేశాన్ని ముందుకు నడిపించే బాధ్యత ఇప్పటి యువతదే అని అన్నారు. సాధించిన ప్రగతి చాలనుకోకుండా ఇంకా టార్గెట్ ఏర్పాటు చేసుకొని ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలు అందుకొని మంచి భవిష్యత్ పొందాలన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం జిల్లాస్థాయిలో చేపట్టామని, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏర్పాటుచేసిన డ్రీమ్స్, అచీవ్మెంట్స్ బోర్డ్స్ చూశామని, విద్యార్థినీ, విద్యార్థులతో మమేకమై రానున్న రోజుల్లో వారి భవిష్యత్ కార్యాచరణపై ముచ్చటించామన్నారు. కసి, పట్టుదలతో చదివి ఉన్నత స్థానం అధిరోహించాలని హితవు పలికారు. ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అత్యధిక మార్కులు సాధించిన పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినీ విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు అందజేయడం సంతృప్తిగా ఉందన్నారు. ఇటువంటి కార్యక్రమాలు చేయడం ద్వారా విద్యార్థుల్లో మరింత ఉత్సాహం కల్పించవచ్చని, విద్యార్థినీ, విద్యార్థులకు మంచి యూనిఫారం అందజేయడంతో పాటు ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మంచి పౌష్టిక ఆహారం అందజేయడం జరుగుతుందన్నారు. 2047 నాటికి ప్రతీ ఇంటికి ఒక పారిశ్రామికవేత్త కావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకు అడుగులు వేస్తుందన్నారు. కొండములగాం ఏపీ మోడల్ స్కూల్‌లో చదువుతున్న ఝాన్సీ, లావేరు మండలం మురపాక జెడ్‌పిహెచ్ స్కూల్‌లో చదువుతున్న రోహన్, ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న దామోదర స్వప్న, పొందూరు హైస్కూల్‌లో చదువుతున్న ఫాతిమా మాట్లాడుతూ ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం పలువురికి ప్రేరణ కల్పిస్తుందన్నారు. కష్టపడి చదివితే విజయం తథ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులకు ప్రశంసాపత్రం, మోడల్‌తో పాటు నగదు బహుమతి అందజేసి, వారి తల్లిదండ్రులతో ఫోటోలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య, ఆర్ఐఓ దుర్గారావు, డివిఎఓ ఆర్.సురేష్ కుమార్, ఆర్డిఓ సాయి ప్రత్యూష, జిల్లాలో అన్ని మండలాల పాఠశాల, కళాశాలల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.




Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.